## ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలి

నస్పూర్, నవంబర్ 23 : ఈ నెల 30న జరిగే ఎన్నికల్లో అర్హులందరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో మొత్తం 743 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ నెల 30న ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఓటింగ్ జరుగుతుందని తెలిపారు. పోలింగ్ కేంద్రాల్లో అన్ని సౌకర్యాలు కల్పించినట్లు తెలిపారు. దివ్యాంగులు, 80 సంవత్సరాల పైబడిన వృద్ధులు, ఎన్నికల విధులు కేటాయించబడిన అధికారులు, ప్రింట్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు వినియోగించుకోవాలన్నారు.

## చెన్నూర్‌లో పోలీసుల కవాతు



కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

చెన్నూర్ టౌన్, నవంబర్ 23 : ప్రజలు తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని జైపూర్ ఏసీపీ మోహన్, చెన్నూర్ పట్టణ సీఐ వాసుదేవరావు సూచించారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేలా ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికల దృష్ట్యా చెన్నూర్ పట్టణంలోని లీస్ స్టేషన్ నుంచి కొత్తగూడెం కాలనీ సీఐ వాసుదేవరావు ఆధ్వర్యంలో కవాతు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కోటపల్లి సీఐ విద్యాసాగర్ రావు, సీఆర్‌పీఎఫ్ ఆర్ఐ జానకి, సీఆర్పీఎఫ్, టీఎస్ఎస్పీ, జైపూర్ సబ్ డివిజన్ సీఐలు, ఎస్ఐలు, రెవెన్యూ అధికారులు, సివిల్, సీఆర్‌పీఎఫ్‌తోపాటు టీఎస్ఎస్పీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించాలి

బెల్లంపల్లి, నవంబర్ 23: సాధారణ ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని కేంద్ర సాధారణ ఎన్నికల పరిశీలకులు విశ్వజిత్ దత్తా తెలిపారు. పట్టణంలోని బజార్ ఏరియా పాఠశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూంను గురువారం ఆయన బెల్లంపల్లి ఎన్నికల రిటర్నింగ్ అధికారి రాహుల్‌తో కలిసి పరిశీలించారు. ఈవీఎంలు, వీవీ ప్యాటులు ఎన్ని ఉన్నాయని రికార్డులతో తనిఖీ చేశారు. డిస్ట్రిబ్యూషన్ పాయింట్, ఇతర సౌకర్యాలను ఆయన పరిశీలించారు. ఈ కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఘనంగా కార్తీక శుద్ధ ఏకాదశి

దండేపల్లి, నవంబర్23: దండేపల్లి మండలంలోని గూడెం రమాసహిత ఆలయంలో కార్తీక శుద్ధ ఏకాదశి పర్వదినం సందర్భంగా గురువారం భక్తుల సందడి నెలకొన్నది. ముందుగా భక్తులు గోదావరి నదిలో పుణ్య స్నానాలు ఆచరించారు.నదిలో కార్తీక దీపాలు వదిలి, గంగమ్మ తల్లికి పూజలు నిర్వహించారు. అనంతరం వివిధ ఆలయాల్లో ప్రత్యేక పూజలుచేశారు. అనంతరం స్వామి వారిని దర్శించుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.460 మంది ఆలయంలో సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు ఆచరించారు.అనంతరం అభిషేకాలు, అర్చనలు, ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, సిబ్బంది ఉన్నారు.

# అవినీతి అన్నదమ్ములు

- నకిలీ సంస్థలతో కోట్ల రూపాయల గోల్‌మాల్
- రూ. 200కోట్ల అక్రమాలను గుర్తించిన ఈడీ
- దోసుకున్న సొమ్ముతో ఎన్నికల బరిలోకి సోదరులు
- మరోసారి జనాన్ని మోసం చేసేందుకు కుట్రలు

మంచిర్యాల, నవంబర్ 23, నమస్తే తెలంగాణ (ప్రతినిధి)/ చెన్నూర్:ఇటీవల ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) జరిపిన సోదాల్లో అన్నదమ్ములైన చెన్నూర్, బెల్లంపల్లి కాంగ్రెస్ అభ్యర్థులు గడ్డం వివేక్, గడ్డం వినోద్ సోదరుల అవినీతి బహిర్గతమైనట్లయింది. తెలంగాణలో తమ ధన రాజకీయాన్ని చెలయించాలనుకున్న అన్నదమ్ములకు ఈడీ సోదాలతో భారీ ఎదురు దెబ్బ తగిలింది. వారి కంపెనీలు, మంచిర్యాల, హైదరాబాద్, రామగుండంలోని ఇండ్లు, వారి బంధువుల ఇండ్లలో ఈడీ అధికారులు ఒక రోజంతా సోదాలు చేసి రూ 200 కోట్ల అక్రమ లావాదేవీలు జరిపినట్లు గుర్తించారు. దీంతో ఈడీ అధికారులు వివేక్‌పై ఫెమా చట్టం కింద కేసు నమోదు చేశారు. ఇలా దోచుకొని, అక్రమంగా సంపాదించిన సొమ్ముతో వారు ప్రస్తుతం జరుగుతున్న అసెంబ్లీ ఎన్నికల్లో చెన్నూర్, బెల్లంపల్లి నియోజకవర్గాల నుంచి కాంగ్రెస్ అభ్యర్థులుగా ఎన్నికల బరిలోకి దిగారు. ఈ ఎన్నికల్లో అక్రమంగా సంపాదించిన కోట్లాది రూపాయల డబ్బులతో వచ్చి ఈ రెండు నియోజకవర్గాలో లక్షలు వెచ్చించి ఇతర పార్టీల నాయకులను కొనుగోలు చేశారు. ఇతర పార్టీల నాయకుల కొనుగోళ్లను వేలం పాటలుగా నిర్వహించారని రెండు నియోజకవర్గాల ప్రజలు చర్చించుకున్నారు. ఓట్ల కోసం విచ్చల విడిగా డబ్బులు ఖర్చు చేసి ప్రజలను మరో సారి మోసం చేయాలని కుట్రలు పన్నారు. ఎన్నికలకు ముందే ఈడీ సోదాలు జరిపి వీరి అక్రమాలను వెలికి తీయడంతో వీరి కుట్రలు ప్రజలకు తెలిశాయి. వివేక్ చెందిన విశాఖ ఇండస్ట్రీస్ ఉద్యోగి, వివేక్ మీడియా సంస్థకు చెందిన ఉద్యోగి కలిసి అక్రమంగా రూ. 50లక్షలు చెన్నూర్‌కు తరలిస్తూ హైదరాబాద్‌లో పోలీసులకు పట్టుపడ్డారు. వివేక్ చెందిన విశాఖ ఇండస్ట్రీస్ నుంచి సెల్ కంపెనీ అయిన విజిలెన్స్ సెక్యూరిటీ సంస్థకు రూ.8 కోట్లు అక్రమ లావాదేవీలు జరిపినట్లు పోలీసులు గుర్తించారు. దీంతో ఈడీ అధికారులు రంగంలోకి దిగి సోదాలు చేశారు. వారి సోదాల్లో గడ్డం సోదరులు పెద్ద ఎత్తున జరిపిన అక్రమలావాదేవీలు బహిర్గతమయ్యాయి. అయితే వీరు అక్రమంగా దోచుకున్న సొమ్ముతో ప్రజలను మోసం చేయాలని చూసిన సంఘటన ఈడీ సోదాలతో బహిర్గతం కావడంతో నియోజకవర్గ ప్రజల్లో చర్చనీయాంశమైంది. వీరి అక్రమ సంపాదనతో ఎన్నికల్లో పోటీ చేస్తూ పెద్ద మొత్తంలో డబ్బులను దుర్వినియోగం చేస్తున్నారని ప్రజలు చర్చించుకుంటున్నారు. డబ్బులతో రాజకీయాలు నడవవని, మాకు అభివృద్ధి, సంక్షేమమే ప్రధానమని నియోజకవర్గ ప్రజలు పేర్కొంటున్నారు. వీరు, వీరి తండ్రి వెంకటస్వామి గతంలో ఇక్కడ నుంచి గెలిచి రాష్ట్రంలో, కేంద్రంలో మంత్రి పదవులు చేపట్టిన నియోజకవర్గం అభివృద్ధిపై ఏనాడూ పట్టించు కోలేదని ప్రజలు తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు. వీరు ఎప్పుడూ డబ్బులనే నమ్ముకుని రాజకీయాలు చేస్తున్నారు. అయితే వీరి డబ్బులు పని చేయకపోగా, ప్రజలు వీరు పోటీ చేసిన ప్రతి సారి తిరస్కరించి ఓడిస్తూ వస్తున్నారు. అయితే వీరి అక్రమ డబ్బులతో నాయకులను మాత్రమే కొనవచ్చు, కాని ప్రజలను కొనలేరు కదా? అంటూ ప్రజలు చర్చించు కుంటున్నారు. చెన్నూర్ నియోజకవర్గంలో ఎక్కడ చూసినా ఓ ఇద్దరి మధ్యలో వివేక్ అక్రమ డబ్బులు విషయమే చర్చ నడుస్తున్నది. మరో సారి డబ్బు బలంతో రాజకీయాలు చేయాలని చూసిన వారికి ఈడీ సోదాలతో ఆదిలో ఎదురు దెబ్బ తగిలింది. దీంతో తమ అక్రమ డబ్బుల వ్యవహారంపై ప్రజలకు తాము ఎలా సమాధానం చెప్పుకోవాలో తెలియక గడ్డం సోదరులు సతమతమవుతున్నారు.




# కాంగ్రెస్‌తో కరెంటు కోతలు..బీజేపీతో గనుల ప్రైవేటీకరణ

- ఆ రెండు పార్టీలను నమ్మద్దు
- కార్మికులకు అన్ని విధాలా హక్కులు కల్పించిన కేసీఆర్
- బీఆర్ఎస్‌కు మద్దతుగా కారు గుర్తుకే ఓటేయాలి
- ఎమ్మెల్యే దివాకర్‌రావు, టీబీజీకేఎస్ అధ్యక్షుడు వెంకట్రావ్




ఆర్కే5బీ గనిపై టీబీజీకేఎస్ అధ్యక్షుడు వెంకట్రావ్‌తో కలిసి మాట్లాడుతున్న ఎమ్మెల్యే దివాకర్‌రావు


శ్రీరాంపూర్, నవంబర్ 23: కాంగ్రెస్ వస్తే కరెంటు కోతలు..బీజేపీవస్తే గనుల ప్రైవేటీకరణ తప్పదని, సింగరేణి కార్మికులకు ఐటీ రద్దు చేసే జాతీయ పార్టీకే సీఎం కేసీఆర్ మద్దతు ఇస్తారని మంచిర్యాల ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు, టీబీజీకేఎస్ అధ్యక్షుడు బీ వెంకట్రావ్ స్పష్టం చేశారు. గురువారం శ్రీరాంపూర్ ఆర్కే 5బీ గనిపై టీబీజీకేఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు కే సురేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు కలిసి మాట్లాడారు. తెలంగాణ ప్రభుత్వం కార్మికులకు ఐటీ రద్దు చేయాలని అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్ర ప్రభుత్వానికి పంపించారని చెప్పారు. కేంద్ర బీజేపీ ప్రభుత్వం కార్మికులకు ఐటీ రద్దు చేయాల్సింది పోయి, ఉన్న గనులను ప్రైవేట్ పరం చేయాలనే కుట్రలు చేస్తున్నదని ఆరోపించారు. అందుకే కేంద్రంలో ఏపార్టీ ప్రభుత్వం వచ్చినా ఐటీ రద్దుకు స్పష్టమైన హామీ ఇస్తేనే బీఆర్ఎస్ మద్దతు ఇస్తుందని చెప్పారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం వస్తే కరెంటు కోతలుంటాయని, బీజేపీ ప్రభుత్వం వస్తే గనులు ప్రైవేట్ చేస్తుందని ఆరోపించారు. కార్మికులు పోరాడి ప్రైవేటీకరణను అడ్డుకున్నారని చెప్పారు. రైతుల వ్యవసాయ విద్యుత్‌కు మీటర్లు పెడుతారన్నారు. సింగరేణి కార్మికులకు సీఎం కేసీఆర్ అన్ని విధాలా హక్కులు కల్పించారన్నారు. సకలజనుల సమ్మె వేతనాలు ఇచ్చారని చెప్పారు. 16 నుంచి 32 శాతంకు లాబాల వాటా పెంచారన్నారు. కార్మికులకు ఉచిత విద్యుత్ ఇస్తున్నారని చెప్పారు. సింగరేణిలో కారుణ్య ఉద్యోగాలు కల్పించరన్నారు. దాంతో వేల మందికి ఉద్యోగాలు దొరికాయన్నారు. కార్మిక పక్షపాతి సీఎం కేసీఆర్ కారు గుర్తుకు ఓటు వేసి దివాకర్‌రావును గెలిపించాలని కోరారు. కార్మికులకు కేసీఆర్, టీబీజీకేఎస్ 100 హక్కులు కల్పించిందన్నారు. ఈ నెల 24న నస్పూర్‌లో జరిగే కేసీఆర్ సభకు కార్మిక వర్గం పెద్ద సంఖ్యలో తరలి వచ్చి విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో కేం ద్ర ఉపాధ్యక్షుడు అన్నయ్య, మల్లారెడ్డి, కేంద్ర చర్చల ప్రతినిధి ఏనుగు రవీందర్‌రెడ్డి, ఏరియా చర్చల ప్రతినిధులు కాశీరావు, వెంగళ కుమారస్వామి, పెట్టం లక్ష్మణ్, బ్రాంచ్ కార్యదర్శి పానగంటి సత్తయ్య, కానగంటి చంద్రయ్య, పిట్ కార్యదర్శులు సత్యనారాయణ, మహేందర్‌రెడ్డి, ఆర్గనైజింగ్ కార్యదర్శి జగదీశ్వర్‌రెడ్డి, అన్వేష్‌రెడ్డి, నాయకులు నీలం సదయ్య, బత్తుల గోపాల్ పాల్గొన్నారు.

**ఎమ్మెల్యేకు పద్మశాలీ సంఘం మద్దతు**

శ్రీరాంపూర్, నవంబర్ 23 : శ్రీరాంపూర్ ఏరియా సింగాపూర్, తాళ్లపల్లి మహర్షి పద్మశాలీ సంఘం గురువారం బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావుకు సంపూర్ణ మద్దతు ప్రకటించారు. శ్రీరాంపూర్ ఆర్కే 6 గుడిసెల్లోని ఆర్ఎంపీ, పీఎంపీ కార్యాలయంలో మహర్షి పద్మశాలీ సంఘం జనరల్ బాడీ సమావేశంలో ఏక గ్రీవంగా తీర్మానం చేసి ఎమ్మెల్యే దివాకర్‌రావుకు మద్దతు ప్రకటిస్తున్నట్లు అధ్యక్షుడు జక్కెన రాజేందర్, కార్యదర్శి తౌటం సమ్మయ్య పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దివాకర్‌రావు మాట్లాడుతూ కోల్‌బెల్ట్ శ్రీరాంపూర్ తాళ్ళపల్లి, సింగాపూర్ పద్మశాలీ సంఘం భవన నిర్మాణానికి నిధులు, స్థలం మంజూరుకు కృషి చేస్తానని చెప్పారు. గతంలోని సంఘం భవనం జాతీయ రహదారి విస్తరణలో కోల్పోయినట్లు తెలిపారు. సింగరేణి యాజమాన్యం నుంచి, లేదా ప్రభుత్వ పరంగా సంఘం కార్యాలయం కోసం స్థలం ఇవ్వడానికి హామీ ఇచ్చారని తెలిపారు. ఈ సందర్భంగా పద్మశాలీ సంఘం అధ్యక్షుడు జక్కెన రాజేందర్ మాట్లాడుతూ తమ కులసంఘం అన్ని విధాలా చర్చించి బీఆర్ఎస్ పార్టీకి, ఎమ్మెల్యే దివాకర్‌రావుకు మద్దతు ఇస్తామని, గెలిపించేందుకు ప్రచారం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నస్పూర్ మున్సిపల్ చైర్మన్ ఇసంపెల్లి ప్రభాకర్, మాజీ సర్పంచ్ గుంట జగ్గయ్య, పద్మశాలీ సంఘం ప్రధాన కార్యదర్శి కొండ శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు కుంట రామన్న, కోశాధికారి మోరె విద్యాసాగర్, నాయకులు సదానందం, సుంకెనపెల్లి రమేశ్, మొండయ్య, రామానుజం, దశరథం, బీఆర్ఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు.



పద్మశాలీ సంఘం సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దివాకర్‌రావు



పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

## జిల్లా స్థాయి ఎంపిక పోటీలు

చెన్నూర్, నవంబర్ 23: స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో చెన్నూర్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో గురువారం జిల్లా స్థాయి ఎంపిక పోటీలు జరిగాయి. ఈ ఎంపిక పోటీలను అండర్ 14,17 విభాగాల్లో నిర్వహించారు. ఈ పోటీల్లో జిల్లాలోని పలు పాఠశాలలకు చెందిన 600మంది విద్యార్థులు పాల్గొన్నారు. పాల్గొన్న విద్యార్థులకు అథ్లెటిక్స్ విభాగంలో పరుగు పం దెం, లాంగ్ జంప్, హైజంప్, షాట్ పుట్, జావలిన్‌త్రో, డిస్కస్‌త్రో పోటీలను నిర్వహించారు. ఇందులో ఎంపికైన వారు జోనల్ స్థాయి పోటీల్లో పాల్గొంటారు.ఈ పోటీలను స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి పరిమల, పీడీ ఫణిరాజ్, వెంకటేశ్వర్‌రెడ్డి, మారయ్య, మీనారెడ్డి, కారెంగుల రామయ్య, కేవీఎం ప్రశాశ్‌రావు నిర్వహించారు.